సాక్షి
రంగారెడ్డి
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



ఉపాధ్యాయులే మార్గదర్శకులు

విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహం అవసరమని వక్తలు సూచించారు. 8లో▸



ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఆపద సమయంలో ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని రాష్ట్ర స్మాల్ స్పోర్ట్స్ కరాటే అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. 8లో▸



ఆపరేషన్ కగార్‌ను ఆపేయండి

ఆపరేషన్ కగార్ పేరిట ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగిస్తున్న దమనకాండను ఆపేయాలని నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డీఎం ఉష శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను అందించేందుకు 90634 61297 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

డ్రగ్స్ తెచ్చాడు.. అడ్డంగా దొరికాడు

మొయినాబాద్: బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి అజీజ్‌నగర్ ప్రాంతంలో విక్రయిస్తున్న వ్యక్తిని రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన శ్రీకాంత్ బెంగళూరు నుంచి ఎండీ ఎంఏ డ్రగ్స్ తీసుకొచ్చి బుధవారం అర్ధరాత్రి మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో విక్రయానికి ఉంచాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద 17.5 గ్రాముల ఎండీ ఎంఏ డ్రగ్స్ దొరికింది. అతన్ని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ.2.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

అధ్యక్షుడే లక్ష్యంగా..

- బీజేపీలో రచ్చకెక్కిన అంతర్గత పోరు
- మరోసారి రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు



సాక్షి, సిటీబ్యూరో: మహా నగర బీజేపీలో అంతర్గత పోరు చినికి చినికి గాలివానగా మారుతోంది. గత ఎన్నికల ముందు నుంచి బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ నేతలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సందర్భం వచ్చినపుడల్లా ఘాటు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా అధ్యక్షుల ఎన్నికలో తన నియోజకవర్గ పరిధిలో.. తనకు తెలియకుండా అధ్యక్షులను ప్రకటించడంపై తీవ్రంగా మండిపడిన రాజాసింగ్.. ఈ దఫా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతంరావు పేరును ఖరారు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఎంతో మంది పార్టీకి నమ్మకంగా పని చేస్తున్న వారు ఉండగా, మీ నియోజకవర్గంలోని వ్యక్తులకు మాత్రమే పదవులు వస్తున్నాయని, మీకు గులాంగిరీ చేసేవారికి మాత్రమే పదవులు ఇస్తారా? అంటూ ఏకంగా పార్టీ రాష్ట్రఅధ్యక్షుడినే లక్ష్యంగా చేసుకుంటూ వీడియో రిలీజ్ చేశారు. తనకు పోటీగా శోభాయాత్ర చేయాలని ప్రయత్నిస్తున్నారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

లేడి.. రోడ్లపై పరుగిడి..



ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లోకి చేరిన జింక

గచ్చిబౌలి: రోడ్లపై పరుగులు తీసిన ఓ జింక ఎట్టకేలకు ఓ ఇంట్లోకు చేరింది. పోలీసులు, ఫారెస్ట్ అధికారుల దాన్ని జూపార్క్‌కు చేర్చారు. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఓ జింక గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్లపై పరుగులు తీయసాగింది. కుక్కలు వెంబడించడంతో వాటి బారి నుంచి స్థానికులు రక్షించారు. భయంతో అక్కడే ఉన్న ఓ హార్డ్‌వేర్ షాపులోకి వెళ్లింది. షాపు నిర్వాహకుడు సూరజ్.. దానికి చపాతీ తినిపించారు. కొద్ది నిమిషాల తర్వాత అక్కడి నుంచి జింక పరుగుతీసి బస్తీలోకి వెళ్లింది. రాణి అనే మహిళ ఇంట్లో నుంచి కమల అనే మహిళ ఇంటి ఆవరణలోకి చేరింది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఉన్నవారు పనికి వెళ్లారు. గమనించిన స్థానికులు బయటకు వెళ్లకుండా గేట్ మూశారు. విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు రవి కుమార్ యాదవ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గచ్చిబౌలి పోలీసులు జింక బయటకు రాకుండా చర్యలు చేపట్టి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్ఓ రమేష్ కుమార్, వెటర్నరీ డాక్టర్ షానవాజ్, నెహ్రూ జూలాజికల్ సిబ్బంది రెస్క్యూ వాహనంతో వచ్చారు. మొదట వల వేసి బంధించి ఇంటి నుంచి బయటకు రప్పించాలని చూడగా ప్రయత్నం ఫలించలేదు. దీంతో దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి రెస్క్యూ వాహనంలో జూపార్క్‌కు తరలించారు.

బెదిరి.. సమూహం నుంచి చెదిరి..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జింకల సమూహాలు ఉన్నాయి. అవి గుంపులుగా ఒకచోట నుంచి మరో చోటికి వెళ్తుంటాయి. నాలుగు రోజులుగా కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో టీజీఐఐసీ చేపట్టిన పనుల కారణంగా జింకల సమూహాలు బెదిరి.. చెదిరిపోయి ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విత్తన మురిపెం

అన్మాస్‌పల్లిలో విత్తన పండుగ షురూ

- హాజరైన పలువురు ప్రముఖులు
- తరలివచ్చిన వ్యవసాయ రంగ నిపుణులు
- ఆయా రాష్ట్రాల విత్తన ఉత్పత్తుల ప్రదర్శన
- సందర్శకులతో సందడిగా మారిన ఎర్త్‌సెంటర్



జ్యోతి ప్రజ్వలన చేసి విత్తన పండుగను ప్రారంభిస్తున్న అతిథులు

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి పంచాయతీ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన తొలి తెలంగాణ విత్తన పండుగకు మంచి స్పందన లభించింది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఏపీ తదితర రాష్ట్రాల నుంచి వ్యవసాయరంగ నిపుణులు, రైతులు హాజరయ్యారు. స్టాల్స్ ఏర్పాటు చేసి, వివిధ రకాల దేశీ విత్తన ఉత్పత్తులను ప్రదర్శించారు.

హాజరైన అతిథులు వీరే..

పర్యావరణ నిపుణుడు పురుషోత్తంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఎస్ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్ రాంపుల్లారెడ్డి, ఒడిశాకు చెందిన ప్రముఖ సీడ్ కన్జర్వేటర్, పద్మశ్రీ రైమటి గురియా, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి, కేరళకు చెందిన భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ నిర్వాహకులు జాకబ్ నెల్లితనమ్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి తదితరులు.

ఎవరేం మాట్లాడారంటే..

సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆహార భద్రతపై అవగాహన కల్పించడం.. సంప్రదాయ విత్తనాల వైభవాన్ని తెలియజేయడం.. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా విత్తన పండుగ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల సందర్భంగా దేశీ విత్తనాల ప్రదర్శన, ఉచిత పంపిణీ, విక్రయాలు ఉంటాయన్నారు. భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ నిర్వాహకుడు జాకబ్ నెల్లితనమ్ మాట్లాడుతూ.. సంప్రదాయ విత్తనాలను సంరక్షించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విత్తన పండుగలతో పాటు, రైతులకు విత్తన సేకరణ, మార్పిడి గురించి అవగాహన కల్పిస్తామని చెప్పారు.



చిరుధాన్యాలతో అలంకరణ

ఆకట్టుకున్న స్టాల్స్

52 స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయా రాష్ట్రాల నుంచి తెచ్చిన చిరుధాన్యాలు, ధాన్యం, కూరగాయలు, వాణిజ్య పంటల విత్తనాలు ప్రదర్శించారు. అతిథులతో పాటు, స్థానికులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు తరలివచ్చి స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. పలువురు ఆ ఉత్పత్తులను కొనుగోలు చేశారు.



స్టాల్స్‌ను తిలకిస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తదితరులు

సంప్రదాయ విత్తనాల సాగు



మా గ్రామంలో 300 మంది వరకు రైతులం సేంద్రియ, సంప్రదాయ ఆర్గానిక్ పంటలు సాగు చేస్తాం. పప్పు దినుసుల పంటలతో పాటు చిరుధాన్యాలను సాగు చేస్తున్నాం. చాలా మంది మా ఉత్పత్తులను ఇష్టంతో కొనుగోలు చేస్తున్నారు. లాభాలు బాగానే ఉన్నాయి. ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి.

– సమ్మమ్మ, బీడెకన్న గ్రామం, ఝరాసంగం మండలం, సంగారెడ్డి జిల్లా

ఉపకరణాలతో ఆదాయం



తాటి కమ్మలతో వివిధ రకాల ఉపకరణాలు తయారు చేస్తాం. వివిధ చోట్ల ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో వీటిని ప్రదర్శిస్తుంటాం. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.30 వేలు సంపాదిస్తా. సంప్రదాయ ఉపకరణాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి.

– పార్థ సారథి, తిరుణమలై, తమిళనాడు



ఆవిష్కరణలు చేసిన వారిని సన్మానిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సేంద్రియ సాగులో కలిసి నడుద్దాం

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

శంకర్‌పల్లి: వ్యవసాయంలో రసాయనాల వాడకం మానేసి, సేంద్రియ సాగువైపు దృష్టి సారించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. గ్రామాల్లో సురాజ్యం, అభివృద్ధి, ప్రగతి రావాలని, అందుకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో శుక్రవారం రంగారెడ్డి– వికారాబాద్ జిల్లాలకు సంబంధించి 'ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్' (ఈజీవీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన 'ప్రకృతి– సేంద్రియ రైతు సమ్మేళనం' కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పలువురు తయారు చేసిన వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. రైతులకు ఉపయోగకరంగా, సులభతరంగా ఉండే వ్యవసాయ పరికరాలను తయారు చేసే పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతుల్లో చైతన్యం నింపి, వారిని సేంద్రియ వ్యవసాయం వైపు నడిపించే విషయంలో తనవంతు సాయం ఉంటుందన్నారు. రసాయనాల వాడకంతో భూమి ఆరోగ్యం విషతుల్యంతో పాటు, మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు ఈజీవీఎఫ్ ముందుకు రావడం అభినందనీయని కొనియాడారు. సైంటిస్టులు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి, నూతన ఆవిష్కరణలు చేసి, సేంద్రియ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని సూచించారు.

ఆకర్షించిన ఆసు యంత్రం

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన చింతకింది మల్లేశం తయారు చేసిన ఆసు యంత్రం సమ్మేళనానికి వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకుంది. చేనేత కార్మికులు చీర తయారు చేసేందుకు పాత యంత్రాల మీద చేతులతో చేస్తూ, ఎంతో ఇబ్బంది పడేవారు. తన ఇంట్లో తన తల్లి పడే కష్టాన్ని చూసిన మల్లేశం ఒక ఆసు యంత్రాన్ని తయారు చేశాడు. దీంతో మనుషులు లేకుండానే ఆసు పోస్తున్నారు. పెద్ద పెద్ద డిజైన్ల చీరలకు 40 పిన్నులతో ఆసు పోసే వారని, తాను తయారు చేసిన యంత్రం ద్వారా 120 పిన్నులతో ఆసు పోసుకోవచ్చని మల్లేశం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్సులు భాగయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఈజీవీఎఫ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, పద్మశ్రీ సుభాష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పూర్వ వైభవం రావాలి

16, 17 శతాబ్దాల్లో భారతదేశం వ్యవసాయాధార దేశంగా ఉండేది. అప్పటి జీడీపీలో 52శాతం వ్యవసాయమే ఉండేది. ప్రస్తుతం అది 16శాతానికి పడిపోయింది. మళ్లీ వ్యవసాయానికి పూర్వ వైభవం తేవాలి. ప్రస్తుతం చాలా ప్రదేశాల్లో డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసే స్థాయికి రైతులు ఎదగడం అభినందనీయం.

– సతీశ్‌రెడ్డి, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్

ఆవిష్కరణలకు ఊతమిచ్చాం

ఆర్మీలో చేసిన సేవలకు గాను 2005లో రాష్ట్రపతి ద్వారా విశిష్ట సేవా మెడల్‌తో సత్కారించగా.. ఆ ఏడాదిలోనే ఉద్యోగ విరమణ పొందా. రైతులకు సాయం చేయాలనే తపనతో 'పల్లె సృజన' పేరుతో సంస్థను స్థాపించాం. 2,500 పైగా జ్ఞాన పద్ధతులను డాక్యుమెంట్ చేసి, గ్రామాల్లో వెళ్లి, కొత్త ఆవిష్కరణలను కనుగొని, ప్రోటో టైపులుగా మార్చి, పేటెంట్లు పొందడం, విక్రయాల్లో తోడ్పాటు అందిస్తున్నాం.

– గణేశన్, పల్లె సృజన, బ్రిగేడియర్

పరిధికి మించి వైద్యం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: ఆర్ఎంపీలు పరిధికి మించి వైద్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీలు తమ పరిధికి లోబడి రోగులకు ఫస్ట్ ఎయిడ్ నిర్వహించాలని సూచించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు డాక్టర్ అనే పదాన్ని వాడుకోవద్దని, కేవలం ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే రాయాలన్నారు. ఆస్పత్రుల నిర్వహణకు విధిగా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం తదితర వాటితో పాటు ఇతర ఏ చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా నైపుణ్యం కలిగిన వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. పట్టణంలోని ఆస్పత్రులు, పాలీక్లినిక్‌లను తనిఖీ చేసి కీర్తి పాలీ క్లినిక్, ప్రజా వైద్యశాల, రాజా మెడికల్ హాల్ వెనుక భాగంలో ఉన్న దవాఖాన, మనిశ్విని క్లినిక్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర ఏర్పాట్లపై సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్వాల్ సూచనలు



సాక్షి, సిటీబ్యూరో: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం శోభాయాత్ర జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకుంటున్న బందోబస్తు, భద్రత చర్యలపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ దృష్టి పెట్టారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు అందజేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని, సిటీలోని అన్ని జోనల్ కంట్రోల్ రూమ్స్ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శోభాయాత్రలో జేబుదొంగతనాలు, చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్ వంటివి లేకుండా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్వాల్‌తో పాటు అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) ఎస్. చైతన్య కుమార్ పాల్గొన్నారు.

పాంబండ హుండీ ఆదాయం లెక్కింపు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలయంలో జాతర హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు రూ. 3,36,895లు సమర్పించినట్లు తెలిపారు. స్వామివారికి అందించిన కోడెలను వేలం వేయగా రూ.64వేల 5వందలు వచ్చిందన్నారు. ఈ కోడెలను వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, విక్రయించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలనర్సయ్య, మర్పల్లి కార్య నిర్వాహణాధికారి శాంతికుమార్, అర్చకులు పాండు శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో ఫెన్సింగ్

రెండో రోజు కొనసాగిన ఫార్మాసిటీ భూముల సర్వే, కంచె ఏర్పాటు పనులు



కొనసాగుతున్న ఫెన్సింగ్ పనులు

యాచారం: మండలంలోని నక్కర్తమేడిపల్లిలో రెండోరోజు పోలీస్ పహారాలో ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు కొనసాగాయి. కోర్టుల్లో కేసులు.. ప్లాట్ల సర్టిఫికెట్లకు కబ్జాలు చూపించకపోవడంతో గుర్రుగా ఉన్నవారు ఫెన్సింగ్ పనులు అడ్డుకోవాలని గురువారం రాత్రి గ్రామంలో దండోరా వేయించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఇద్దరు ఏసీపీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 మంది ఇతర పోలీస్ సిబ్బంది సర్వే, ఫెన్సింగ్ పనుల వద్దకు చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా నక్కర్తమేడిపల్లి–పల్లెచల్కతండా రోడ్డులో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే వారి వాహనాలను తనిఖీ చేసి పంపించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద మరో పికెట్ ఏర్పాటు చేసి గ్రామంలోని రైతులెవరినీ ఫార్మాసిటీ భూముల్లోకి రానివ్వలేదు. ఆందోళనకారుల కదలికలపై నిఘా పెట్టారు. రెండు రోజులుగా ఫార్మాసిటీకి సేకరించిన భూముల చుట్టూ దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు.

రైతులకు మద్దతుగా ఉంటాం

ఫార్మాసిటీ రైతులకు మద్దతుగా ఉంటాం, బలవంతంగా ఫార్మా భూములపైకి వెళ్తే ఊరుకునే ప్రసక్తే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులుగా నక్కర్తమేడిపల్లిలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్వే, ఫెన్సింగ్ వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎకరాకు 121 గజాల ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ స్థలాలు చూపించకపోగా రైతుల భూములను స్వాధీనం చేసుకోవడం చట్టరీత్యానేరమన్నారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి భూములను రైతులకు తిరిగిచ్చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

షాబాద్‌: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించడంతో పాటు, మార్గదర్శకంగా నిలవాలని దక్షిణ మధ్య క్షేత్ర విద్యా భారతి సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు రవీంద్ర శర్మ సూచించారు. శుక్రవారం రాత్రి షాబాద్‌ మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్‌ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. భవిష్యత్తుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నిర్దిష్టమైన లక్ష్యంతో చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, అప్పుడే సమాజంలో అత్యున్నతమైన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పాఠశాల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, పూర్వపు విద్యార్థి డాక్టర్‌ అమరేందర్, భాగ్యనగర్‌ విభాగ్‌ కార్యదర్శి భూషణ్, మాజీ సర్పంచ్‌లు సుబ్రమణ్వేశ్వరి రవీందర్, శైలజ ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారాన్ని వినియోగించుకోండి

కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌

- పారిశ్రామిక పార్కు కోసం భూములిచ్చిన లగచర్ల రైతులకు చెక్కులు అందజేత



లగచర్ల రైతుకు పరిహారం చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌

తాండూరు: దుద్యాల్‌ మండలంలో పారిశ్రామిక పార్కు కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌ సూచించారు. శుక్రవారం తాండూరు సబ్‌ కలెక్టర్‌ కార్యాలయాన్ని సందర్శించి అదనపు కలెక్టర్‌ లింగ్యానాయక్, సబ్‌ కలెక్టర్‌ ఉమా శంకర్‌ప్రసాద్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం పారిశ్రామిక పార్కు కోసం భూములిచ్చిన హకీంపేట్, లగచర్ల గ్రామాల రైతులకు పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హకీంపేట్, లగచర్ల గ్రామాల్లోని 25 మంది రైతుల నుంచి 31.08 ఎకరాల భూమిని సేకరించామని తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.6.20 కోట్ల విలువ చేసే పరిహారం చెక్కులను రైతులకు అందజేసినట్లు పేర్కొన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 150 గజాల చొప్పున ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు, అర్హత ఆధారంగా ఇంటికో ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు 75 గజాల ఇంటి స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు.

మెనూ అమలు చేయాలి

అనంతరం తాండూరులోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను కలెక్టర్‌ సందర్శించారు. సదుపాయాలపై ఆరా తీశారు. వసతి గృహ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నిత్యం మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు క్రీడా సామగ్రి ఉన్నాయా అని అడగ్గా.. సిబ్బంది లేవని సమాధానం చెప్పారు. దీంతో క్రీడా సామగ్రిని సమకూరుస్తానని కలెక్టర్‌ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్‌ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ తదితరులు ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీలో పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దు

అనంతగిరి: జిల్లాలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సన్నబియ్యం పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సన్నబియ్యం పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వరాదని ఆదేశించారు. గోదాముల్లో బియ్యం కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. రేషన్‌ షాపులకు సకాలంలో బియ్యం సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్‌ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్క్‌ చేసిన బైక్‌ చోరీ

మొయినాబాద్‌: వెంటర్నరీ ఆస్పత్రి వద్ద పార్క్‌ చేసిన బైక్‌ చోరీకి గురైంది. ఈ సంఘటన మొయినాబాద్‌ మున్సిపల్‌ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని మైలార్‌దేవ్‌పల్లికి చెందిన పుంరెడ్డి రామకృష్ణారెడ్డి.. శుక్రవారం ఉదయం 9 గంటలకు మొయినాబాద్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చాడు. పక్కనే ఉన్న ఆస్పత్రి వద్ద బైక్‌ పార్కుచేసి, పనుందని వెళ్లాడు. సాయంత్రం 3.30 గంటలకు వచ్చి చూసేసరికి బైక్‌ కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అన్న మరణించాడని..

మనస్తాపంతో తమ్ముడి బలవన్మరణం

మొయినాబాద్‌: అన్న మరణించాడని మనస్తాపం చెందిన తమ్ముడు పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం బాపట్లకు చెందిన హరిబాబు(60), భార్య లక్ష్మీపార్వతితో జీవనోపాధి నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం మండల పరిధి ఎత్‌బార్‌పల్లికి వచ్చారు. స్థానికంగా ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందేవాడు. కాగా జనవరిలో హరిబాబు సోదరుడు మరణించాడు. నాటి నుంచి దిగాలుగా ఉన్న హరిబాబు.. మార్చి 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

‘ఆపరేషన్‌ కగార్‌’ను ఆపేయండి



ప్రజాధర్నా వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

చేవెళ్ల: ఆపరేషన్‌ కగార్‌ పేరిట ఛత్తీస్‌ఘడ్‌ దండకారణ్యంలో ఆదివాసీలపై కొనసాగిస్తున్న దమనకాండను వెంటనే ఆపేయాలని సీపీఐ(ఎంఎల్‌)న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.మహేందర్‌ డిమాండ్‌ చేశారు. కగార్‌ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలకు తీరని అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఆపరేషన్‌ కగార్‌ను ఆపాలని కోరుతూ ఈ నెల 8న ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ప్రజాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసి జాతిని అంతమొందించి, కార్పొరేట్‌ కంపెనీలకు ప్రయోజనం చేకూరేలా బీజేపీ యత్నిస్తోందని, దీనిని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు తీవ్రంగా ఖండించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, ఏఐకేఎంఎస్‌ చేవెళ్ల డివిజన్‌ నాయకులు కె.జైపాల్, న్యూడెమోక్రసీ నాయకులు అశోక్, శ్రీకాంత్‌ ఉన్నారు.

సికిల్‌ సెల్‌కు చెక్‌..

సికిల్‌ సెల్‌ ఎనిమియా నియంత్రణకు సీసీఎంబీ కృషి

- 4 రాష్ట్రాల్లో ప్రాథమిక స్థాయిలో వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక మిషన్‌
- నూతనంగా జార్ఖండ్‌ ప్రాజెక్టుకు టాటా ఫౌండేషన్‌తో భాగస్వామ్యం
- వివరాలు వెల్లడించిన సంస్థ సీఈఓ, డైరెక్టర్‌

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సికిల్‌ సెల్, ఎనీమియా వ్యాధిగ్రస్తులకు సేవలందించడంతో పాటు ఈ వ్యాధి ప్రాథమిక గుర్తింపునకు నగరంలోని జాతీయ పరిశోధనా సంస్థ సీసీఎంబీ విశేషంగా కృషి చేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ డా. వినయ్‌కే.నందికూరి తెలిపారు. ఇందులో భాగంగా సీసీఎంబీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికిల్‌ సెల్‌ ఎనీమియా స్క్రీనింగ్‌ మిషన్‌లో ప్రముఖ సంస్థ టాటా స్టీల్‌ ఫౌండేషన్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుంది. ఈ నేపథ్యంలో సీసీఎంబీ వేదికగా శుక్రవారం టాటా స్టీల్‌ ఫౌండేషన్‌ సీఈఓ డా.సౌరవ్‌ రాయ్‌ సమక్షంలో ఎంఓయూను ప్రకటించారు. ఈ సందర్భంగా డా. వినయ్‌ మాట్లాడుతూ., సికిల్‌ సెల్‌ ఎనీమియా స్క్రీనింగ్‌ మిషన్‌లో భాగంగా మహారాష్ట్ర, చత్తీష్‌ ఘడ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఇప్పటి వరకు 28 లక్షల మందికి పరీక్షలు చేశామన్నారు. ఇందులో 2 లక్షల మంది క్యారియర్లుగా (జన్యుపరమైన వ్యాధి కారకులు)నిర్ధారించగా, 11 వేల మంది సికిల్‌ సెల్‌ ఎనీమియా వ్యాధి గ్రస్తులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రయత్నంలో టాటా స్టీల్‌ ఫౌండేషన్‌ భాగస్వామ్యం కావడం శుభపరిణామమన్నారు. జన్యుపరమైన కారణాలతో వచ్చే ఈ వ్యాధిని ముందుగా గుర్తించడంతో బాధితులకు మేలు చేయవచ్చని, వీరికి బ్లడ్‌ ట్రాన్స్‌ఫూజన్‌ చికిత్స, హైడ్రాక్సీయూరియా మెడిసిన్‌ అందించడం అనే 2 అవకాశాలున్నాయన్నారు. శాశ్వత పరిష్కారం కోసం సీఎస్‌ఐఆర్, ఎయిమ్స్‌ న్యూఢిల్లీతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. భవిష్యత్‌లో తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర భాగస్వాముల సహకారంతో ఈ సేవలను ప్రారంభించే యోచనలో ఉన్నామని, ఖమ్మం, భద్రాచలం తదితర ఆదివాసీ ప్రాంతాల్లో ఈ మిషన్‌ సేవల అవసరముందన్నారు.

54 కేసుల్లో రూ.3.28 కోట్లు రిఫండ్‌

బాధితుడికి చెక్కు అందించిన సీపీ



బాధితుడికి చెక్కు అందచేస్తున్న సీపీ

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్‌ పరిధిలో మార్చిలో నమోదైన సైబర్‌ క్రైమ్‌ కేసుల్లో 54 మంది బాధితులకు రూ.3.28 కోట్లు రిఫండ్‌ అయింది. ఫిర్యాదు వచ్చిన మరుక్షణం స్పందించిన సైబర్‌ క్రైమ్‌ పోలీసులు సైబర్‌ నేరగాళ్ల ఖాతాల్లో ఈ మొత్తాన్ని ఫ్రీజ్‌ చేశారు. న్యాయస్థానం అనుమతితో ఈ మొత్తాన్ని బాధితులకు అందించారు. ఓటీపీ ఫ్రాడ్‌లో రూ.47 లక్షలు పోగొట్టుకున్న బాధితుడికి రూ.40 లక్షలు రిఫండ్‌కు సంబంధించిన చెక్కును నగర కొత్వాల్‌ సీపీ ఆనంద్‌ శుక్రవారం అందజేశారు.

క్రికెట్‌ ఆడుతూ కుప్పకూలాడు

- గుండెపోటులో ఇంజినీరింగ్‌ విద్యార్థి మృతి
- సీఎంఆర్‌ఈసీ కళాశాలలో ఘటన

మేడ్చల్‌రూరల్‌: క్రికెట్‌ ఆడుతూ ఓ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన కండ్లకోయలోని సీఎంఆర్‌ఈసీ కళాశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్‌ సీఎంఆర్‌ఈసీ కళాశాలలో బీటెక్‌ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తోటి విద్యార్థులతో కలిసి క్రికెట్‌ ఆడేందుకు కళాశాల ఆవరణలోని గ్రౌండ్‌కు వెళ్లాడు. ఆటలో భాగంగా ఫీల్డింగ్‌ చేస్తున్న వినయ్‌ గుండపోటు రావడంతో ఒక్కసారిగా గ్రౌండ్‌లోనే కుప్పకూలాడు. తోటి విద్యార్థులు అతడిని సమీపంలోని సీఎంఆర్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు వినయ్‌ ఖమ్మం జిల్లాకు చెందిన పేద విద్యార్థి .. తల్లిదండ్రులు రోజు కూలీ చేస్తూ తమ కుమారుడిని ఉన్నత చదువు చదివిస్తున్నట్లు తెలిసింది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే విన్యాసం చేస్తున్న విద్యార్థినులు

షాబాద్‌: బాలికలకు చదువు ఒక్కటే సరిపోదని, ఆపద సమయంలో ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని జపాన్‌ కరాటే అసోసియేషన్‌ ఇండియా, తెలంగాణ స్కూల్‌ స్పోర్ట్స్‌ కరాటే అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శుక్రవారం షాబాద్‌ మండల పరిధి అస్పల్లిగూడ గ్రామ శివారు కైట్‌ కళాశాలలో నిర్వహించిన కరాటే బెల్ట్‌ పోటీల్లో ఎంజేపీ మొగిలిగిద్ద గురుకుల పాఠశాల విద్యార్థినులు 29 మంది గ్రేడింగ్‌ ఉత్తీర్ణత సాధించారు. ఇందులో డబుల్‌ ప్రమోషన్‌ జయశ్రీ ఎల్లో, మేఘన ఆరెంజ్, శ్రావ్య ఎల్లోతో పాటు మరో 27 జూనియర్‌ రెడ్‌ బెల్టులు పొందారు. ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శివరంజని, పీటీ రేణుక, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



యాలాల: పోలీసుల అదుపులో నంబర్‌ ప్లేటు లేని ద్విచక్రవాహనాలు



దోమ: బాస్‌పల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగేందర్‌

తాండూరు: తాండూరు పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నంబర్‌ ప్లేట్‌ లేని వాహనాలపై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు సీఐ సంతోష్‌ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నంబర్‌ ప్లేట్‌ లేని 50 ద్విచక్రవాహనాలను పట్టుకుని అవగాహన కల్పించామన్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం వాహనదారులకు జరిమాన విధించడంతో పాటు కొత్త నంబర్‌ ప్లేట్‌ బిగించామన్నారు.

దోమలో..

దోమ: వాహనదారులు రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఇంచార్జి ఎస్‌ఐ నాగేందర్‌ అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలను తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. నంబర్‌ ప్లేట్, హెల్మెట్‌ తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ ప్లేటు లేకుంటే కఠిన చర్యలు

యాలాల: నంబరు ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. శుక్రవారం యాలాల మండల కేంద్రంలో సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్లులేని పది ద్విచక్రవాహనాలను సీజ్‌ చేశారు. అనంతరం వాహన యజమానులతో మాట్లాడి నంబర్‌ ప్లేట్లను ఏర్పాటు చేయించారు. వాహనాలకు తప్పనిసరిగా నంబర్‌ ఉండలన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేను డీఎస్పీని.. పదండి ఠాణాకు

- ఇద్దరు యువకుల కిడ్నాప్‌
- జూబ్లీహిల్స్‌లో నకిలీ పోలీసుల హల్‌చల్‌

బంజారాహిల్స్‌: నంబర్‌ ప్లేట్‌ లేని కారుకు పోలీస్‌ స్టిక్కర్‌ తగిలించుకుని వెళ్లిన ఆగంతకులు గదిలో ఉన్న ఇద్దరు సినీ పరిశ్రమకు చెందిన యువకులను కిడ్నాప్‌ చేసి అచ్చంపేటకు తీసుకువెళ్లి చితకబాదిన సంఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కడప జిల్లాకు చెందిన భూమిరెడ్డి కిషోర్‌రెడ్డి టీవీ నటులు ఇంద్రాణి, మేఘనలకు పర్సనల్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. టీవీ సీరియళ్లకు డ్రైవర్‌గా పనిచేస్తున్న సందీప్‌రెడ్డి, ఓ తెలుగు ఛానల్‌లో కాస్ట్యూమర్‌గా పని చేస్తున్న పల్లె శివ ముగ్గురూ కలిసి శ్రీకృష్ణానగర్‌లో అద్దెకు ఉంటున్నారు. అచ్చంపేట సమీపంలోని బీకే ఉప్పనూతల గ్రామానికి చెందిన శివ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ కలిసి నాలుగు రోజుల క్రితం పెద్దలకు చెప్పకుండా పారిపోయారు. ఈ నేపథ్యంలో ఆమె సోదరుడు సోహెల్‌తో పాటు మరో ఇద్దరు యువకులు గురువారం రాత్రి కిషోర్‌రెడ్డి గదికి వచ్చారు. తాము పోలీసులమని, శివ ఆచూకీ చెప్పాలని అతడిని చితకబాదారు. తమకు ఏమీ తెలియదని చెప్పినా వినిపించుకోకపోగా, తాము పోలీసులమంటూ జూబ్లీహిల్స్‌ పోలీస్‌ స్టేషన్‌కు పదండి అంటూ కిషోర్, సందీప్‌లను కారులో ఎక్కించుకుని తక్కుగూడకు తీసుకెళ్లి మళ్లీ కొట్టి, ఫోన్లు లాక్కున్నారు. అక్కడి నుంచి ఉప్పనూతల గ్రామానికి తీసుకెళ్లడంతో అప్పటికే అక్కడ అప్పటికే రెండు కార్లలో సిద్ధంగా ఉన్న మరో 10 మంది యువకులతో కలిసి వారిని మరోసారి తీవ్రంగా కొట్టారు. అనంతరం బాధితులను అచ్చంపేట పోలీస్‌ స్టేషన్‌ సమీపంలో వదిలేసి వెళ్లిపోయారు. టీవీ నటి ఇంద్రాణికి కిషోర్‌ ఫోన్‌ చేసి చెప్పడంతో ఆమె జూబ్లీహిల్స్‌ పోలీసులకు సమాచారం అందించింది. బాధితులు కూడా అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విషయాన్ని చెప్పారు. జూబ్లీహిల్స్‌ పోలీసుల నగరానికి తిరిగి వచ్చిన కిషోర్, సందీప్‌ ఘటనపై జూబ్లీహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోహెల్, ఇబ్బూతో పాటు ప్రియురాలి పెదనాన్న, వారి బంధుమిత్రులపై కేసు నమోదు చేశారు. కిషోర్, సందీప్‌లను కిడ్నాప్‌ చేసింది నకిలీ పోలీసులని తేల్చారు. అమ్మాయి అడ్రస్‌ కనుక్కునేందుకు వారిని కిడ్నాప్‌ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితులపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. జూబ్లీహిల్స్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిని కాల్చిన కొవ్వొత్తి

పరిగి: విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో కొవ్వొత్తి వెలిగించగా అది ప్రమాదవశాత్తు ఇంటిని కాల్చిన ఘటన మండల పరిధిలోని రాపోల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ఇదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో గ్రామంలో విద్యుత్‌ సరఫరా నిలిచి పోయింది. దీంతో గ్రామానికి చెందిన సునీతా ఇంట్లో కొవ్వొత్తి వెలిగించి ఫ్రిడ్జ్‌పై పెట్టింది. ప్రమాదవశాత్తు కొవ్వొత్తి మంటలు ఫ్రిడ్జ్‌కు అంటుకుని ఇళ్లంత మంటలు వ్యాపించాయి. ఈ ఘటనతో ఇంట్లోని వారందరు బయటకు పరు గులు తీశారు. బండల ఇళ్లు కావడంతో వాసాలకు మంటలు తగిలి ఇళ్లు మొత్తం కాలి బూడిదైంది. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని సామాగ్రి, రూ.10వేలు, భూ పత్రాలు కాలి బూడిదయ్యాయి.

పాడు‘బడి’న భవనం

15 ఏళ్లుగా నిరుపయోగం

- రూ.30 లక్షలు ప్రజాధనం వృథా
- ఊరికి దూరంగా ఉండటమే కారణం



నిరుపయోగంగా పాఠశాల భవనం

బంట్వారం: ఊరికి దూరంగా ఉండటమే ఆ పాఠశాల చేసుకున్న పాపం. ఫలితంగా పదిహేనేళ్లుగా ఆ భవనం నిరుపయోగంగా పడుంది. ప్రస్తుతం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు మధ్య ఒంటరిగా పాడుబడిన బంగ్లాను తలపిస్తోంది.

2009 తొర్మామిడిలో..

బంట్వారం మండలం తొర్మామిడిలో అదనపు పాఠశాల భవన నిర్మాణం కోసం 2009లో రూ.30 లక్షలతో భవనాన్ని నిర్మించారు. ప్రాథమికోన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. అందుకు తగిన ఏర్పాట్లను చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పట్నం సునీతారెడ్డి ప్రారంభించారు. అనంతరం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇక్కడికి మార్చారు. ఊర్లోని పాతభవనాన్ని పూర్తిగా ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు.

ఆదిలోనే..

జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల భవనానికి ఆదిలోనే హంస పాదు ఎదురైంది. పట్టుమని పది రోజులు కూడా కొత్త భవనంలో తరగతులు కొనసాగలేదు. ఊరికి 3 కిలో మీటర్ల దూరంలో పాఠశాల ఉన్న కారణంగా.. విద్యార్థులు అంత దూరం నడవ లేకపోయారు. దీంతో చేసేది లేక సంబంధిత అధికారులు యథావిధిగా ఊరిలోని పాత పాఠశాల భవనంలోకి మార్చారు.

అసాంఘిక కార్యకాలపాలకు

రూ.30 లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనం వృథాగా మారింది. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది. విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేకపోగా, ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది. నాటి నుంచి కొత్త భవనం శిథిలావస్థకు చేరువ కాగా.. శిథిలావస్థ భవనం ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతులు కొనసాగడం గమనార్హం. కొత్తగా నిర్మించిన భవనం 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల మధ్య పాడుబడిన భవనంలా తలపిస్తోంది. అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారింది.